మలేరియా నివారణకు చర్యలు: డీఎంవో

సరుబుజ్జిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలేరియా నివారణకు అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ తెలిపారు. వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల తరగతి గదులతోపాటు ఆవరణలో మలేరియా నివారణ మందు సైఫినోత్రిన్‌ను పిచికారీ చేయించారు. అలాగే వెన్నెలవలస గ్రామంలో కూడా ప్రతీ ఇంట్లో ఈ మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.సూర్యం, సీహెచ్‌వో మోహనరావు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ రుక్మిణి, ఏఎన్‌ఎం ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

విధ్వంసం అంతమై.. వికాసం ఆరంభమై..



- కూటమి ఘన విజయానికి ఏడాది
- వైసీపీని 'ఛీ'కొట్టిన ప్రజలు
- జిల్లాలో అన్ని స్థానాలూ కైవసం
- అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతున్న ప్రభుత్వం



శ్రీకాకుళం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన ముగిసి నేటికి (బుధవారం) ఏడాది అవుతుంది. ఐదేళ్ల విధ్వంసాన్ని సృష్టించిన జగన్ సర్కారుకు గత ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి తిరుగులేని విజయాన్ని అందించారు. దీంతో రాష్ట్రంలో వికాస పాలన ప్రారంభమైంది. 2024 జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగింది. జిల్లాలో కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఎనిమిది అసెంబ్లీ స్థానాలతో పాటు శ్రీకాకుళం పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇచ్ఛాపురం నుంచి బెందాళం అశోక్, పలాస నుంచి గౌతు శిరీష, శ్రీకాకుళం గొండు శంకర్, పాతపట్నం మామిడి గోవిందరావు, టెక్కలి కింజరాపు అచ్చెన్నాయుడు, నరసన్నపేట బగ్గు రమణమూర్తి గెలుపొందగా, ఎచ్చెర్ల నుంచి నడుకుదిటి ఈశ్వరరావు(బీజేపీ) గెలుపొందారు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మూడో దఫా పోటీచేసి లక్షలాది ఓట్ల మెజార్టీతో కింజరాపు రామ్మోహన్‌నాయుడు గెలుపొందారు. దీంతో కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకోగా, వైసీపీ నాయకులు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. రాష్ట్ర మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడుకు, కేంద్ర మంత్రిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు అవకాశం లభించింది.

ఐదేళ్లూ నరకం..

వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలు నరకం చూశారు. జగన్ సర్కారు అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేసింది. ఒకపక్క అరాచకాలు.. మరోపక్క సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేస్తూ పోస్టింగులు.. మంత్రులుగా ఉన్నవారు, స్పీకర్‌గా ఉన్నవారు సైతం తమ పరిధిదాటి అభ్యంతర వ్యాఖ్యలు.. ఆపై అక్రమ అరెస్టులు చేస్తూ ప్రశాంతంగా ఉండే శ్రీకాకుళం జిల్లాను కూడా రాజకీయంగా కలుషితం చేసేశారు. వైసీపీ పాలనలో శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు అత్యంత దారుణంగా ఉండేది. అప్పట్లో శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆమదాలవలస నుంచి స్పీకర్ తమ్మినేని సీతారాం ఉన్నా ఈ రోడ్డుపై కనీసం దృష్టి సారించలేదు. అదే వారి ఓటమికి కారణమైందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. జగన్ పాలనలో అసంఘటిత రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇసుక లభ్యంకాక నిర్మాణరంగం కుదేలైంది. పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులకు గురయ్యారు. వృద్ధులు, వితంతువుల సామాజిక పింఛన్‌ను రూ.వెయ్యి పెంచేందుకు ఏకంగా ఐదేళ్ల సమయం జగన్ తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఒకే దఫా వెయ్యి రూపాయలు పెంచింది. ఇసుకపై వైసీపీ విధించిన నిబంధనను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎత్తేశారు. ఉచితంగా ఇసుకను అందిస్తున్నారు. వేల కోట్ల రూపాయలతో జిల్లా అంతటా రోడ్లు పనులు పూర్తి చేశారు. ఈ ఏడాదిలోనే అటు మూలపేట పోర్టు పనులు పూర్తికానుండటం.. ఆపై వంశధార ప్రాజెక్టు, ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పట్టాలెక్కడం.. కొత్తగా ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదన.. స్థల పరిశీలన.. మత్స్యకారులకు భృతి ఏకంగా రూ. 20వేలు ఇలా అన్నిరకాల సంక్షేమ కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వం దూసుకుపోతుంది.



తీరంలో యోగాంధ్ర

- ఐదువేల మందితో ఆసనాలు
- యోగాతో రుగ్మతలు దూరం: కలెక్టర్

6లో

మునిగిన మునగ రైతు

- అమాంతం పడిపోయిన ధరలు
- ఆందోళనలో ఉద్దానం రైతాంగం

6లో



తీరం.. ఇక సురక్షితం!

- కోతకు గురికాకుండా వనాలు
- మొక్కల పెంపకానికి ప్రభుత్వ నిర్ణయం
- రేపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ శ్రీకారం
- ప్రతి 10 కిలోమీటర్లకు ఒక నర్సరీ
- అటవీ, ఉపాధిహామీ శాఖలకు బాధ్యతలు



కోతకు గురవుతున్న బందరువానిపేట తీరం

రణస్థలం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత పరిరక్షణపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 973 కిలోమీటర్ల తీర ప్రాంతంలో పెద్ద ఎత్తున వనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తీరం వెంబడి మొక్కలు నాటాలని నిర్ణయం తీసుకుంది. ఉపాధి హామీతో పాటు అటవీ శాఖ నిధులతో వీటిని ఏర్పాటుచేయడానికి కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మొక్కల పెంపకాన్ని ప్రారంభించనున్నారు. దీంతో జిల్లాకు మహర్దశ పట్టనుంది. ఎందుకంటే జిల్లాల విభజన తరువాత సముద్ర తీర ప్రాంతం ఎక్కువగా ఉన్న జిల్లా మనదే. దీంతో తీర ప్రాంతంలో మొక్కల పెంపకంతో బహుళ ప్రయోజనాలు ఉండనున్నాయి. ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేపట్టనుండడంతో మత్స్యకారులకు ఉపయోగపడనుంది. వారికి వేటతో పాటు ఉపాధి పనులు కూడా చేసుకునే వెసులబాటు కలగనుంది. రాష్ట్రంలో విస్తరించి ఉన్న 973 కిలోమీటర్ల తీర ప్రాంతంలో దాదాపు 28.7 శాతం భూభాగం కోతకు గురైనట్టు గత ఏడాది ఆగస్టులో కేంద్ర భూ భౌతిక విజ్ఞాన శాఖ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి 25.12 కిలోమీటర్ల తీర ప్రాంతం రెడ్ జోన్ లో ఉన్నట్టు తేలడం ఆందోళన కలిగించే విషయం. అందుకే ఏపీ ప్రభుత్వం ఈ వనాల పెంపునకు నిర్ణయం తీసుకుంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం ఉంది. రణస్థలం మండలం దోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకూ 193 కిలోమీటర్లు విస్తరించి ఉన్నట్టు గణంకాలు చెబుతున్నాయి. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో వందలాది మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. జిల్లాలో బాహుదా, మహేంద్రతనయా, వంశధార, నాగావళి నదులు సముద్రంలో కలుస్తున్నాయి. నదుల సంగమం వద్ద ఏటా వరదలు పోటెత్తుతుండడంతో తీరం కోతకు గురవుతోంది. నదీ పరీవాహక ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మాణం లేకపోవడం, నీటి స్థిరీకరణకు అవకాశం లేకపోవడం, కరకట్టల నిర్మాణం చేపట్టకపోవడంతో నీటి ప్రవాహ గమనం పెరిగి ఒకేసారి సముద్రంలోకి నీరు పోటెత్తుతోంది. అదే సమయంలో సముద్రం ఉగ్రరూపం దాల్చుతుండడంతో తీరం కోతకు గురవుతోందని సముద్ర నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో ఎక్కువగా సముద్రంలో నదులు కలిసే ప్రాంతంలో తీరం కోతకు గురవుతోంది. శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, (మిగతా 6వ పేజీలో)

ఐటీఐ అడ్మిషన్లకు షెడ్యూల్

- రేపటి నుంచి ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్
- జిల్లాలోని 23 ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 3,512 సీట్లు

6లో

తీర్థయాత్రలకు విమాన, రైల్వే ప్యాకేజీ

- ఐఆర్‌సీటీసీ టూరిజం ఎగ్జిక్యూటివ్ సంఘమిత్ర రౌల్

6లో

సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- కోటబొమ్మాళిలో ప్రజాదర్బార్

8లో



వెన్నుపోటుకు ప్రతిరూపం జగన్‌రెడ్డి

- పీయూసీ చైర్మన్ కూన రవికుమార్

7లో

అయ్యో.. బాహుదా!

- నిర్వహణ లేక నీరసించిన నది
- ఒడిశా కనికరిస్తేనే దిగువ ప్రాంతానికి నీరు
- ఆవేదనలో రైతాంగం



నీరు లేక ఎడారిలా మారిన బాహుదా నది

ఇచ్ఛాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా నది పక్కనే ఉంటే సాగు,తాగునీటికి చింత ఉండదు. కానీ, ఇచ్ఛాపురం పట్టణ, పరిసర గ్రామాల ప్రజల పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. చెంతనే బాహుదా నది రూపంలో నీటివనరు ఉన్నా ఫలితం లేకపోతోంది. సాధారణ రోజుల్లో నదిలో చుక్కనీరు కనిపించదు. ఒక్క మాటలో చెప్పాలంటే వరదల సమయంలోనే నది అన్నట్టు కనిపిస్తుంది. మిగతా రోజుల్లో నదితో నిష్ఫలమే. గతంలో లక్షలాది మందికి దాహం తీర్చుతూ..వేల ఎకరాలను సస్యశ్యామలం చేసేది బాహుదా నది. ఇప్పుడు మాత్రం కేవలం ఒడిశా ప్రయోజనాలకే అన్నట్టు మారిపోయింది. వారి దాహం, సాగునీటి అవసరాలు తీరాక దిగువ ప్రాంతానికి నీరు విడిచిపెడుతుండడం ఇచ్ఛాపురం ప్రాంత ప్రజలకు శాపంగా మారింది.

సాగు, తాగునీటి వనరుగా..

ఒడిశాలో పుట్టి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది బాహుదా. ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో 12 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ఇచ్ఛాపురం పట్టణంతో పాటు మరో 30 గ్రామాలకు సాగునీటి ప్రధాన ఆధారం కూడా బాహుదే. కానీ, నదికి సంబంధించి సరైన నిర్వహణ లేదు. నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, గత పాలకుల తప్పిదాలు, నదిలో నీటి ప్రవాహం మార్పులు తదితర కారణాలతో (మిగతా 6వ పేజీలో)



పోలూరు అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసిన కుళ్లిన గుడ్లు

ఈ గుడ్లు తినేదెలా?

- అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన కోడిగుడ్ల సరఫరా
- కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామన్న ఐసీడీఎస్ సీడీపీవో

మెళియాపుట్టి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలూరు అంగన్‌వాడీ కేంద్రానికి మంగళవారం కుళ్లిన కోడి గుడ్లను సరఫరా చేశారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఈ గుడ్లను పిల్లలకు ఎలా తినిపించేదని ప్రశ్నిస్తున్నారు. పోలూరు (మిగతా 6వ పేజీలో)

ఆక్రమణలతో మదన పడుతోంది..

- బక్కచిక్కిన మదనగోపాలసాగరం
- జలాశయంలో పేరుకుపోతున్న పూడిక
- సర్‌ప్లస్‌వైర్ నుంచి లీకేజీలు
- బాగు చేయాలని రైతాంగం విన్నపం

టెక్కలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మదనగోపాల సాగరం జలాశయం బక్కచిక్కింది. ఓ వైపు ఆక్రమణలు, మరోవైపు పూడికలు, ఇంకోవైపు లీకులైన సర్‌ప్లస్‌వైర్లు, బలహీనమైన గట్లతో అధ్వానంగా తయారైంది. దీంతో రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఐదు దశాబ్దాల కిందట మదనగోపాల సాగరం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మించారు. వంశధార ప్రధాన ఎడమకాలువ వెంబడి వచ్చే నీటితో పాటు మాలపేట గెడ్డ, దుర్గ గెడ్డల నుంచి వచ్చే క్యాచ్‌మెంట్ వర్షపు నీరంతా నిల్వ ఉండేలా దీన్ని నిర్మించారు. గతంలో 285 ఎకరాల్లో నిర్మించిన ఈ జలాశయం ప్రస్తుతం బక్కచిక్కిపోయింది. కొంతవరకు ఆక్రమణలకు గురికావడంతో పాటు పూడికలు, కంపచెట్లతో జలాశయం నిండిపోయింది. దీంతో 0.172టీఎంసీ నిల్వ సామర్థ్యం నుంచి 0.152టీఎంసీ సామర్థ్యానికి (మిగతా 7వ పేజీలో)



చుక్కనీరు లేని మదనగోపాలసాగరం జలాశయం

తీరంలో యోగాంధ్ర



● ఐదువేల మందితో యోగాసనాలు ● యోగాతో రుగ్మతలు దూరం: కలెక్టర్

శ్రీకాకుళం రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పెద్ద గణగళ్లవానిపేట వద్ద సముద్ర తీరంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఐదు వేల మంది యోగాసానాలు వేసి సందడి చేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచనల ప్రకారం ఈ రోజు యోగాసనాలు వేయడం జరిగిందన్నారు. మత్స్యకారులకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యోగాతో ఎన్నో రుగ్మతలను దూరం చేయొచ్చన్నారు. ప్రతీరోజు యోగా చేయాలని ఇంటి వద్ద, పార్కు వద్ద ప్రతీ రోజు యోగాసనాలు చేసుకొవచ్చన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈ నెల 21వ తేదీన విశాఖలో ఐదు లక్షలు మందితో నిర్వహించనున్నట్టు వివరించారు. మే 21న అరసవల్లిలో యోగాంధ్ర ప్రారంభించడమైనదని, ఇటీవల చారిత్రక ప్రదేశమైన డచ్ భవనం వద్ద వెయ్యి మందితో ఆసనాలు చేయించినట్టు వివరించారు. తీర ప్రాంతంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐదు వేల మందికి పైగా మత్స్యకారులు పాల్గొన్నట్టు చెప్పారు. శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రహదారిలో ప్రతీ రోజూ యోగాసనాలు చేస్తున్నట్టు తెలిపారు. యోగా పోటీలు నిర్వహిస్తామన్నారు. యోగాని మన జీవితంలో భాగం చేసుకుందామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. మనస్సు, శ్వాస, వ్యాయామమే యోగా అని తద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. నిత్యమూ యోగాసనాలు వేయడం ద్వారా అనేక రుగ్మతులను దూరం చేసుకోవచ్చన్నారు. ప్రధాన వేదిక వద్ద మురళీకృష్ణ అందరిచేత యోగాసనాలు వేయించి యోగా ఇన్‌స్ట్రక్టర్లను ఏర్పాటు చేశారు. ఆర్.కల్పనా సూక్ష్మ వ్యాయాయంతో ప్రాంభించి యోగాసనాలు వేయించారు. జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేష్, డీఆర్వో ఎం. వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, డ్వామా పీడీ సుధాకర్, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత, స్త్రీ, మహిళ శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ, విభిన్న ప్రతిభా వంతులు శాఖ ఏడీ కె.కవిత, ఆయుష్ వైద్యులు జగదీష్, జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయాణ, పెద్ద గణగళ్లవానిపేట ఎంపీటీసీ అమ్మాజీరావు, సర్పంచ్ బర్రి రామారావు, ఇతర జిల్లా అధికారులు, మత్స్యకారులు, పెద్ద సంఖ్యలో సల్గొన్నారు.




యోగాంధ్ర కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

ఐటీఐ అడ్మిషన్లకు షెడ్యూల్

● రేపటి నుంచి ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్

ఎచ్చెర్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు మంగళవారం షెడ్యూల్ విడుదలైనట్టు జిల్లా అడ్మిషన్ల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు తెలిపారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ కౌన్సెలింగ్ ఈ 5 నుంచి 10వ తేదీ వరకు (9వ తేదీ మినహా) జరుగుతుందన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్లు పరిశీలన పూర్తిచేసుకున్న అభ్యర్థులకు మెరిట్ ప్రాతిపదికన ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్‌కు పిలుస్తున్నామన్నారు. రెండేళ్ల కాల వ్యవధి గల కోర్సులైన ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మెకానిక్ మోటార్ వెహికల్, డ్రాఫ్ట్‌మన్ సివిల్ కోర్సులకు, అలాగే ఏడాది కాల వ్యవధి గల కోర్సులైన వెల్డర్, డీజిల్ మెకానిక్, టైలరింగ్, కంప్యూటర్స్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని 3 ప్రభుత్వ ఐటీఐల్లో 640 సీట్లు, 20 ప్రైవేటు ఐటీఐల్లో 2,872 సీట్లు ఉన్నట్టు వివరించారు. అభ్యర్థులు ఏ రోజున కౌన్సెలింగ్‌కు హాజరుకావాలో సమాచారాన్ని సెల్‌ఫోన్‌లకు పంపించామన్నారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు అనివార్య కారణాల వల్ల హాజరుకాని అభ్యర్థులకు తిరిగి ఈ నెల 10వ తేదీన ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.


ఎల్.సుధాకరరావు, జిల్లా అడ్మిషన్ల కన్వీనర్

షెడ్యూల్ వివరాలు..

తేది	ఉదయం (9 నుంచి 1 గంట వరకు)	మధ్యాహ్నం (2 నుంచి 5 గంటల వరకు)
5-6-2025	1-137 ర్యాంకులు (10.0- 8.5 మార్కులు)	138-277 ర్యాంకులు (8.3- 7.7 వరకు)
6-6-2025	278-414 ర్యాంకుల వరకు (7.5-7.0 మార్కులు)	415-562 ర్యాంకుల వరకు (6.8-6,3 మార్కుల వరకు)
7-6-2025	563-691 ర్యాంకుల వరకు (6.2-5.8 మార్కుల వరకు)	692- 858 ర్యాంకుల వరకు (5.7- 5.0 మార్కుల వరకు)
8-6-2025	859-932 ర్యాంకుల వరకు (4.8 - 4.5 మార్కుల వరకు)	933- 1035 ర్యాంకుల వరకు (4.3 - 0.0 మార్కుల వరకు)

మునిగిన మునగ రైతు

● అమాంతం పడిపోయిన ధరలు
● ఆందోళనలో ఉద్దానం రైతాంగం



ఇచ్ఛాపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉద్దానం రైతులకు ఏదీ కలిసి రావడం లేదు. తితలీ తుపాను నాటి నుంచి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఈ ఏడాది జీడి ఆశించిన స్థాయిలో పండలేదు. దీనికితోడు ఇప్పుడు అంతర పంటగా సాగుచేస్తున్న మునగ ధరలు కూడా అమాంతం పడిపోయాయి. తొలుత మునగ దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఎంతో ఆనందించారు. జీడి నష్టం కొంత భర్తీ చేసుకోవచ్చని భావించారు. కానీ ధర పూర్తిగా పడిపోయింది. కిలో 50 రూపాయలు వరకూ ఉండేది. అంటే పది కిలోల కట్ట రూ.500 వరకూ పలికేది. ఇప్పుడు రూ.120 మించి ధర లేదు. దీంతో ఉద్దానం రైతులు లబోదిబోమంటున్నారు. ఉద్దానం అంటే పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో.. దాదాపు 24 వేల హెక్టార్లలో జీడి, కొబ్బరి పంటలు సాగవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి ఎకరాలో అంతర పంటలుగా 10 నుంచి 12 వరకూ మునగ చెట్లు ఉంటాయి. ఏడాదికి మూడుసార్లు కాపు వస్తుంది. ప్రస్తుతం పంట ఉత్పత్తి గణనీయంగా ఉంది. కానీ ధర చూస్తే పూర్తిగా పడిపోయింది.

ఉత్తరాది రాష్ట్రాలకు..

జిల్లా నుంచి ఎక్కువగా ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. ఇచ్ఛాపురం, కంచిలి, హరిపురం, పలాస మార్కెట్లకు ఉత్తరాది వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఇప్పుడు ధర అమాంతం పడిపోవడంతో రైతులు గగ్గోలుపెడుతున్నారు. మునగ ఎక్కువగా ఉత్పత్తి కావడంతోనే ధర పతనమైనట్టు వ్యాపారులు చెబుతున్నారు. కిలో మునగ రూ.50 ఉంటేనే గిట్టుబాటు అయ్యేది. కానీ ఇప్పుడు రూ.15కు పడిపోయినట్టు చెబుతున్నారు.

ప్రత్యేక గుర్తింపు..

ఉద్దానం మునగకు ప్రత్యేకంగా గుర్తింపు ఉంది. ఇక్కడి కాయలు రుచికరంగా ఉంటాయి. నేలను బట్టి మునగలో రుచులు ఉంటాయని తెలుస్తోంది. ఉత్తరాది రాష్ట్రాల వారు ఉద్దానం మునగను బాగా ఇష్టపడతారు. వాణిజ్య పంటలుగా గుర్తింపు పొందిన జీడి, కొబ్బరి పంటల్లో అంతర పంటగా వేస్తున్న మునగకు సరైన ప్రోత్సాహం లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా మార్కెటింగ్‌తో పాటు రవాణా సదుపాయం కల్పిస్తే కొంత ప్రయోజనం ఉంటుందంటున్నారు.

చాలా నష్టపోతున్నాము..

మునగ ధర పడిపోయింది. ఈ ఏడాది జీడి పంట కూడా పండలేదు. మునగ విరగకాయడంతో కొంత గట్టెక్కుతామని అనుకున్నాము. కానీ మునగ ధర చూస్తుంటే కడుపు మండిపోతోంది. సాధారణ సమయాల్లో కూరగాయల వ్యాపారుల వద్ద కొనుగోలు చేసినప్పుడు కిలో రూ.50 పలుకుతోంది. మా వద్ద మాత్రం రూ.10 నుంచి రూ.15కే అడుగుతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి.

-జి.రాము, రైతు, బెలియాపుట్టుగ

అయ్యో.. బాహుదా!

(ఐదో పేజీ తరువాయి)

ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అన్నింటికీ మించి ఒడిశా ఎగువ ప్రాంతాల్లో అక్రమంగా నిర్మించిన ప్రాజెక్టులు కింద ప్రాంతంగా ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలకు శాపంగా మారుతున్నాయి. లెక్కలేనన్ని ఎత్తి పోతల పథకాలు ఒడిశా ప్రాంతాల్లో నిర్మించారు. వాటన్నింటినీ దాటుకొని కింది ప్రాంతాలకు నీరు రావడం గగనంగా మారింది. ఇటీవల ఇచ్ఛాపురం పట్టణానికి తాగునీటి ఇబ్బందులు తలెత్తడంతో నీరు విడిచిపెట్టాలని ఒడిశా అధికారులను కోరారు. వారు నిరాకరించడంతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, జిల్లా కలెక్టర్ స్పందించి అక్కడి అధికారులతో మాట్లాడి నీరు విడిచిపెట్టేలా చేశారు.

ఖరీఫ్ సమీపిస్తున్నా...

ప్రస్తుతం ఖరీఫ్ సమీపిస్తోంది. కానీ, నదికి సంబంధించి ఎటువంటి నిర్వహణ పనులు ప్రారంభం కాలేదు. ఒడిశా భూభాగంలో ప్రాజెక్టుల మీద ప్రాజెక్టులు కడుతున్నారు. కానీ మన భూభాగంలో 18 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 11 ఓపెన్ హెడ్ చానళ్లను కనీసం మరమ్మతు చేయలేకపోతున్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సాగునీటి వనరుల విషయంలో కదలిక వచ్చింది. వాటిని వీలైనంత త్వరగా బాగుచేయాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే గతం మాదిరిగా పంట కాలువలు, గ్రోయిన్లు, రాతికట్టడాలకు రైతులే సొంతగా నిధులు వేసుకొని బాగుచేసుకోవాల్సి ఉంటుంది. బాహుదా ఆయకట్టు పరిధిలో 750 చెరువులు ఉన్నాయి. వాటికి నది నీటిని మళ్లించాలి. వరద పోటు తీరం, పంట పొలాలపై పడకుండా చిన్నపాటి కరకట్టలు నిర్మించాల్సి ఉంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టి పెట్టాలి..

బాహుదా నదిపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాలి. నిర్వహణ లేక నది నీరసించిపోయింది. పూర్తిగా స్వరూపమే మారిపోయింది. ఒక్క వర్షాకాలంలో మాత్రమే నదిలో నీరు కనిపిస్తుంది తప్ప.. మిగతా రోజుల్లో ఒడిశా దయాదక్షణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించి బాహుదా నిర్వహణపై ఫోకస్ చేయాలి. బెల్లుపడ, ఈదుపురం, పూర్ణాటకం, కేశుపురం, బూర్జుపాడు, డొంకూరు, సన్యాసిపుట్టుగ ఇలా చాలా గ్రామాలు రైతాంగం అంతా బాహుదానది నీటిపై ఆదారపడి ఉంది.

-ఆశి జీవులు రెడ్డి, బెల్లుపడ రైతు, ఇచ్ఛాపురం

చాలా బాధేస్తోంది..

నదిని చూస్తే బాధేస్తోంది. పక్కనే నది ఉన్నా పొలాలకు సాగునీరు అందని దుస్థితి. ఒడిశా ప్రాజెక్టుల మీద ప్రాజెక్టులు కడుతోంది. కానీ మన భూభాగంలో ఉన్న చిన్నపాటి ప్రాజెక్టులు సైతం మరమ్మతులు చేయలేకపోతున్నాం. ఈ నియోజకవర్గ ప్రజలు ఎక్కువగా ఆధారపడే బాహుదా నదిపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

-కాళ్ల ధర్మారావు, రైతు, గొల్లవీధి, ఇచ్ఛాపురం

తీరం.. ఇక సురక్షితం!


కొత్తముక్కావం వద్ద పెంచుతున్న సరుగుడు మొక్కలు

(ఐదో పేజీ తరువాయి)

పోలాకి, సోంపేట, మందస, ఇచ్ఛాపురం, కవిటి తీరంలోనే కోత అధికంగా కనిపిస్తోంది. తీర ప్రాంతం కోతకు ఉష్ణమండల తుఫాన్లు రుతుపవనాల సీజన్లో వచ్చే వరదలు, సముద్ర మట్టాల పెరుగుదల, పోర్టులు, హార్బర్ల నిర్మాణం, మడ అడవుల నరికివేత, సముద్ర జలాలు కలుషితం కావడం, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాల కలయికతో సముద్ర జలాల ఆమ్లీకరణ వంటివి కారణాలుగా పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. అందుకే వనాల పెంపుతో వాటికి చెక్ చెప్పాలని భావిస్తున్నారు.

● మండలానికి ఒక నర్సరీ..

ఏ జిల్లాకు అనుగుణం ఆ జిల్లాలో ఉపాధి, అటవీశాఖ ద్వారా వనాలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. మన జిల్లా తీర ప్రాంతం సరుగుడు, నీలగిరికి అనుకూలమని తేలింది. టెక్కలి డివిజన్‌లో తీరంలో కొబ్బరి, జీడి సాగు అధికంగా ఉంది. ఇవి తీరం కోతకు గురికాకుండా రక్షణగా నిలుస్తున్నాయి. అయితే ప్రభుత్వం తాజాగా తీర ప్రాంతంలో ప్రతి 10 కిలోమీటరుకు ఒక నర్సరీని ఏర్పాటుచేయాలని భావిస్తోంది. జిల్లాలో 11 తీర మండలాలు ఉన్నాయి. ప్రతి 10 కిలోమీటర్లకు ఒకటిచొప్పున ఏర్పాటుచేయాలంటే 19 నర్సరీలు ఏర్పాటుచేయాలి. కానీ మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించినట్టు తెలుస్తోంది.

మంచి నిర్ణయం..

కూటమి ప్రభుత్వానిది మంచి నిర్ణయం. తీర ప్రాంత పరిరక్షణకు పెద్దపీట వేయడం శుభ పరిణామం. జిల్లాలో తీర ప్రాంతంలో సరుగుడు, నీలగిరి తోటలు ఉండేవి. ఇవి తీరం కోతకు గురికాకుండా రక్షణ కవచంలా నిలిచేవి. తీరానికి సీఆర్‌జడ్ పరిధి 500 మీటర్ల వరకూ ఉంటుంది. ఇక్కడ చెట్లు పెంచితే అలల ఉధృతి తగ్గుముఖం పడుతుంది. వృక్షాల వేర్లు తీరానికి బలమైన అండగా నిలుస్తాయి. నదులు సముద్రంలో కలిసే చోట ఎటువంటి అడ్డంకులు లేకుండా చూసుకోవాలి. తీరం వెంట రాతికట్టడాలు ఉంటే మరింత శ్రేయస్కరం.

-స్వామినాయుడు, భూగర్భ శాస్త్రవేత్త, రణస్థలం

శుభ పరిణామం..

తీర ప్రాంత రక్షణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టడం శుభ పరిణామం. సముద్ర జలాల్లో విపరీతమైన వ్యర్థాలు కలుస్తున్నాయి. రసాయన పరిశ్రమల నుంచి వెలువడిన వ్యర్థాలను నేరుగా సముద్రంలోకి పైపులైన్ల ద్వారా విడిచిపెడుతున్నారు. జీరో కాలుష్యంగా మార్చి వ్యర్థాలను విడిచిపెట్టాలి. కానీ అలా జరగడం లేదు. అందుకే సముద్రం ఉగ్రరూపం దాల్చుతోంది. మత్స్యసంపద నశిస్తోంది. సముద్రం ఇసుకను అక్రమంగా తరలించడం కూడా కోతకు గురికావడానికి ప్రధాన కారణం.

-కూన రామం, పర్యావరణవేత్త, బుడుమూరు

రెండుశాఖల సమన్వయంతో..

జిల్లాలో తీర ప్రాంత పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. తీరం వెంబడి 50 వేలు సరుగుడు, 50 వేలు తాటి టెంకలు నాటనున్నాం. ప్రజల జీవనోపాధి పెంచడం, ఆపై తీర ప్రాంతాన్ని విపత్తుల నుంచి రక్షించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టనున్నాం. జిల్లాలో 193 కిలోమీటర్ల పరిధిలో మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ విషయంలో అటవీ, ఉపాధి శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతాయి.

-ఎస్.వెంకటేశ్వరరావు, డీఎఫ్‌వో, శ్రీకాకుళం

ఈ గుడ్లు తినేదెలా?

(ఐదో పేజీ తరువాయి)

అంగన్‌వాడీ కేంద్రంలో 15 మంది చిన్నారులు ఉన్నారు. గ్రామానికి చెందిన గేదెల సంతోష్‌కు రెండేళ్ల పాప ఉంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రం నుంచి గుడ్లను అందించారు. ఈ గుడ్లలో అధికంగా కుళ్లిపోయి ఉన్నాయి. గుడ్లను ఉడకబెట్టడానికి నీటిలో వేసిన వెంటనే పగిలిపోయాయి. ఇటువంటి గుడ్లు పిల్లలు తింటే అనారోగ్యానికి గురికావడం కాయమని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెల కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన గుడ్లను సరఫరా చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ కేంద్రాలకు సంబంధిత కాంట్రాక్టర్ నెలకు నాలుగు సార్లు గుడ్లు సరఫరా చేయవలసి ఉంటుంది. అయితే, వాటిని ఒకేసారి అందిస్తున్నాడు. దీంతో ఎక్కువ కాలం నిల్వ ఉండడంతో కుళ్లిపోతున్నాయి. దీనిపై ఐసీడీఎస్ సీడీపీవో విమలరాణి మాట్లాడుతూ.. సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. 'ప్రతి నెల అంగన్‌వాడీ కేంద్రాలకు నాలుగు సార్లు గుడ్లు సరఫరా చేయాలి. అలాకాకుండా రెండు సార్లు సరఫరా చేస్తున్నారు. వాటిని కేంద్రంలో నిల్వ ఉంచుతుండడంతో కుళ్లిపోతున్నాయి. దీనిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తాం.' అని తెలిపారు.


లక్ష రూపాయల చెక్కును విరాళంగా అందజేస్తున్న దాతలు

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం

అరసవల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారికి శ్రీకాకుళానికి చెందిన నడింపల్లి జ్యోతి కుటుంబసభ్యులు మంగళవారం రూ.1,01,116 విరాళం ఇచ్చారు. దర్శనం అనంతరం స్వామి వారి శాశ్వత అన్నదాన పథకానికి ఈ చెక్కును ఆలయ సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులకు అందజేశారు.

తీర్థయాత్రలకు విమాన, రైల్వే ప్యాకేజీ

● ఐఆర్‌సీటీసీ టూరిజం ఎగ్జిక్యూటివ్ సంఘమిత్ర రౌల్

ఆమదాలవలస, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రలకు విమాన, రైల్వే ప్యాకేజీలు నడుపుతున్నట్టు ఐఆర్‌సీటీసీ టూరిజం ఎగ్జిక్యూటివ్ సంఘమిత్ర రౌలో తెలిపారు. ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్డు) రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జూన్ 28 నుంచి జూలై 3వ తేదీ వరకు శాంకరీదేవి శక్తిపీఠం, శ్రీలంక రామాయణ యాత్ర, వివిధ దేవాలయాల సందర్శన ఉంటుందన్నారు. కేరళ విమాన ప్యాకేజీతో వివిధ దేవాలయాల దర్శనకు సెప్టెంబరు 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఏడు పగళ్ల ప్రయాణానికి, గుజరాత్ పుణ్యక్షేత్రాలు, స్టాట్యూ ఆఫ్ యూనిటీ ప్రయాణానికి, అలాగే ఆగస్టు 14వ తేదీ నుంచి 23వ తేదీ వరకు తొమ్మిది రాత్రులు, 10 పగళ్ల ప్రయాణానికి తగిన విమాన ప్యాకేజీలను నిర్ణయించినట్టు తెలిపారు. ప్రయాణంలో విమాన చార్జీలు, వసతి, భోజనాలు వంటి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. అదే విధంగా గంగా రామాయణ పుణ్యక్షేత్ర రైళ్ల యాత్ర వారణాసి, అయోధ్యకు ప్యాకేజీ ఉందని, ఈ రైలు శ్రీకాకుళం రోడ్డు మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. జూన్ 14 నుంచి 26వ తేదీ వరకు అన్ని వసతులతో కలిపి స్లీపర్ రూ.16,200, 3ఏసీ రూ.26,500, 2ఏసీ రూ.35,000గా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు 92810 30748, 9281495847, 9550166168 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



ప్యాకేజీ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

పట్టణవాసులకు గేదెల బెడద

- పట్టించుకోని మునిసిపల్ అధికారులు
- అవస్థలుపడుతున్న ఆమదాలవలస పట్టణ ప్రజలు

ఆమదాలవలస, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని 16వ వార్డు పరిధిలోని డాబాల వారివీధిలో గేదెల బెడద వల్ల ఇబ్బందిపడుతున్నామని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యమూ ఇదే రహదారిపై 14, 15, 17 తదితర వార్డుల ప్రజలు మార్కెట్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలకు ఇదే రహదారగుండా రాకపోకలు సాగిస్తూ ఉంటారు. డాబాల వారివీధి ప్రధాన రహదారిపై నిర్వాహకులు నిత్యమూ గేదెలను నిలుపుదల చేసి నరకం చూపిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పలుమార్లు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ చూసిచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదని పలువురు అధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన దుర్గంధం మాట అటు ఉంచితే అటు వైపుగా వెళ్లే వారిపై గేదెల విరుచుకుపడుతున్నాయని పలువురు చెబుతున్నారు.

చోద్యం చూస్తున్న యంత్రాంగం

డాబాలవారి వీధిలో గేదెలు, ఆవులు, వల్ల పలుమార్లు గాయపడిన ఘటనలపై పురపాలక సంఘ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. గతంలో గేదెలు, ఆవులు నిర్వాహకులను పిలిచి మందలించి పురపాలక సంఘ అధికారులు విడిచిపెట్టేశారని పలువురు గుర్తు చేస్తున్నారు. గేదెలకు భయపడి ఈ రహదారి గుండా ప్రయాణించడం మానేశామని పలువురు చెబుతుండడం విశేషం. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడంలో ఆంతర్యం ఏంటో వారికే


పట్టణంలోని సంచరిస్తున్న గేదెలు

ఎరుకని పలువురు చెబుతుండడం విశేషం. ఇప్పటికైనా పురపాలక సంఘ అధికారులు రహదారిపై ప్రజలు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉంది. పశువుల యజమానులను చాలాసార్లు హెచ్చరించాం. ఈసారి నోటీసులు అందిస్తాం. అప్పటికీ వారిలో మార్పు రాకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆయా ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేయిస్తున్నాం.

- పి.బాలాజీ ప్రసాద్, మునిసిపల్ కమిషనర్


రహదారిపైనే పశువులను కట్టిన దృశ్యం

నోటీసులిచ్చినా..

నరుబుజ్జిలి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పల్లె పండగలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసుకుంటున్నాయి. అయితే కొంతమంది వ్యక్తుల దురాక్రమణ చర్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిగురువలస పంచాయతీలో పల్లెపండగ ద్వారా సుమారు కోటి రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది ఈ రోడ్లపైనే పశువులు కట్టేస్తున్నారు. దీంతో రహదారి అధ్వానంగా తయారై. రాకపోకలకు ఆ గ్రామస్థులు ఇబ్బందిపడుతున్నారు. పిల్లలు, వృద్ధులు ఆ రహదారిలో నడవడానికి భయపడుతున్నారు. దీనిపై కొంతమంది గ్రామస్తులు ఆ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయగా.. రోడ్డుపై పశువులు కడుతున్నవారికి నోటీసులు ఇచ్చారు. అయినా వారిలో ఎటువంటి మార్పు రాకపోవడం విశేషం. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

ఆక్రమణలతో 'మదన'పడుతోంది..

(5వ పేజీ తరువాయి)

పడిపోయింది. ఫలితంగా దిగువ ప్రాంతాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. ఇప్పటికైనా సాగరాన్ని బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

బాగు చేస్తేనే సాగునీరు..

మదనగోపాలసాగరాన్ని పూర్తిస్థాయిలో బాగు చేస్తేనే టెక్కలి, నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల్లో సుమారు 34వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందనుంది. సుమారు రూ.10 కోట్లు వెచ్చించి పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు గట్లను పటిష్ఠం చేయాలి. అలాగే, సర్‌ప్లస్‌వైర్ లీకులు అరికడితే సాగునీరు వృథా కాకుండా ఉంటుంది. వంశధార ప్రధాన ఎడమ కాలువ వెంబడి సుమారు 650 క్యూసెక్కులు, అధిక వర్షాలు పడే సమయంలో మాలపేటగెడ్డ, దుర్గగెడ్డ నుంచి 4,440 క్యూసెక్కుల నీరు క్యాచ్‌మెంట్ ఏరియా రూపంలో జలాశయంలోకి చేరుతుంది. ఈ పరిస్థితిలో గట్లు బలంగా ఉంచడం, పూడికలు తొలగించడం వంటివి చాలా అవసరం. 2019 ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మదనగోపాల సాగరంలో పూడిక తీత పనులకు సుమారు రూ.1.60కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో అధికారులు రూ.70లక్షలు వరకు వెచ్చించి కొంతమేరకు పూడికతీత పనులు చేపట్టారు. మిగిలిన నిధులు వెచ్చించే సరికి ప్రభుత్వం మారిపోయింది. ఆ తరువాత కాంట్రాక్టర్లు పనులు చేపట్టకపోవడంతో సుమారు రూ.90లక్షల నిధులు వినియోగం లేక మురిగిపోయాయి. కాగా, ప్రస్తుతం ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను టూరిజం హబ్‌గా మార్చేందుకు మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు ఆదేశాలతో అధికారులు రూ.10కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. జలాశయంలో వంద ఎకరాలను ప్రత్యేక కొలనుగా తయారుచేసి బోటు షికార్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

పూడిక తొలగిస్తాం

మదనగోపాలసాగరం జలాశయంలో పూడికలు తొలగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. సర్‌ప్లస్‌వైర్ల లీకులను గుర్తించాం. గండ్లు పడకుండా ఉండేందుకు బండింగ్ పనులు కూడా చేపట్టాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి.

- బి.శేఖరరావు, ఈఈ, వంశధార ప్రధాన ఎడమ కాలువ

శ్రీకూర్మంకు పూర్వ వైభవం తీసుకువస్తా..


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీకూర్మనాథుని క్షేత్రం వెలసిన శ్రీకూర్మంకు పూర్వ వైభవం తీసుకువస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గ్రామ దేవత మోహినీ భద్రాంబిక అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన శ్రీకూర్మంలో క్రికెట్ పోటీలు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని శ్రీకూర్మంలో ఒక రోజు నిర్వహించడానికి కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో క్రికెట్ నిర్వాహక కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా స్వేచ్ఛావతి అమ్మవారి సంబరం



ఇచ్ఛాపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాన్ని భగవతి స్వేచ్ఛావతి ఆటో యూనియన్ సభ్యులు ఘనంగా జరిపారు. మంగళవారం పాత బస్టాండ్ జంక్షన్ వద్ద గల ఆటో యూనియన్ స్టాండ్ నుంచి అమ్మవారి ఘటాలతో కోలాటం, నాటకాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు మోహన్, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గారపేట యువకుడికి రూ.71 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం


పొట్నూరు దిలీప్

పొందూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గారపేట(కృష్ణాపురం) గ్రామానికి చెందిన పొట్నూరు దిలీప్ అనే యువకునికి క్యాంపస్ సెలక్షన్‌లో ఏడాదికి రూ.71 లక్షల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. లక్నో ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ విభాగంలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన దిలీప్ బెంగుళూరుకు చెందిన రూబ్‌రిక్ ఇండియా లిమిటెడ్ అనే కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా భారీ ప్యాకేజీకి ఎంపికయ్యాడు. దిలీప్ తండ్రి పట్నాన రమణ బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్‌లో అధికారిగా పనిచేస్తుండగా.. తల్లి సుజికుమారి గృహిణి. భారీ ప్యాకేజీకి ఎంపికైన దిలీప్‌ను గ్రామస్థులు అభినందించారు.

పెద్దమ్మతల్లి, నూకాలమ్మకు పూజలు


సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గ్రామదేవతల సిరిమానోత్సవాలు సందర్భంగా పాత శ్రీకాకుళంలో పెద్దమ్మ, నూకాలమ్మకు మంగళవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోషిమాత ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున పెద్దమ్మవారి దేవర ఏర్పాట్లు, నూకాలమ్మ తల్లి దేవర ఏర్పాట్లు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అలంకరణలతో జిల్లా పరిషత్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ బంగ్లా వరకు నిర్వహించారు. మంగళవారం వేయికాళ్ల ఘటం పూజ నిర్వహించారు. ఈ నెల 6వ తేదీ వరకు ప్రతీరోజూ పరమాన్నం అట్లు, బొబ్బట్లు, గారెలు పులిహోర, పప్పుఅన్నం అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అదేవిధంగా ఖాజీపేట నుంచి పెద్ద సిరిమాను చెట్టును తెప్పించి పూజలు నిర్వహించారు. రథాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

రెడ్డి సత్యనారాయణ సంగీత విభావరి ఆధ్వర్యంలో మంగళవారం భక్తి సినీ సంగీత విభావరి, డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ నిర్వహించారు. 4న పెంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంగీత విభావరి, డ్యాన్స్ బేబి డాన్స్, 4న పెంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి, ఈ నెల 6న ఆంధ్రా కవాలి, 7న సినీనటుల డూప్ డ్యాన్స్, 8న బాలనాగమ్మ బుర్రకథ, 9న భాగవతం, 10న జబర్దస్త్ సినీ ఆర్టిస్టులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు నక్క శంకరరావు, ఎల్.రామలింగస్వామి తదితరులు తెలిపారు.

వెన్నుపోటుకు ప్రతిరూపం జగన్‌రెడ్డి

- ఎమ్మెల్యే కూన రవికుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

పొందూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటుకు పేటెంట్ వైసీపీ అని, అందుకు ప్రతిరూపం మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అంటూ పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. తన ఎదుగుదలకు కారణమైన కాంగ్రెస్ పార్టీని, తన భుజాన ఎత్తుకు పెంచిన బాబాయిని వెన్నుపోటు పొడిచి, గొడ్డలిపోట్లకు గురిచేసి హత్యచేసి, ఆస్తికోసం తల్లి, చెల్లికి వెన్నుపోటు పొడిచిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి అంటూ మండిపడ్డారు. ఏడాది ప్రజారంజకంగా పాలించిన కూటమి ప్రభుత్వంపై కక్ష సాధింపుకే బుధవారం వెన్నుపోటు దినంగా ప్రకటించిన జగన్‌రెడ్డి.. తన రాజకీయానికి సమాధికట్టి ఏడాదైన సందర్భంగా వైసీపీ వర్ధంతిదినం జరుపుకోవాలన్నారు.

పండగను విజయవంతం చేయాలి

వివిధ శాఖల అధికారులు, పండగ నిర్వహణ కమిటీ సమన్వయంతో ఈ నెల 15 నుంచి నిర్వహించనున్న అమ్మవారి పండగలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రవి కుమార్ సూచించారు. పండగ ఏర్పాట్లపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, పండగ ని ర్వహణ కమిటీ, గ్రామస్థులతో సమీక్షించారు. ట్రాఫిక్ సమస్యపై దృష్టిపెట్టాలని సీఐ సత్యనారాయణకు సూచిం చారు. అలాగే మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన ఫేజ్-1, ఫేజ్-2 నాడు-నేడు పనులపై హెచ్ ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అధికా రులు, ఎంఈవోలతో సమీక్షించారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.వెంకటరావు గైర్హాజరుపై మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కూన సత్యనారాయణ, చైర్మన్ మాజీ ఏఎంసీ ఎ.రాము, నాయకులు సేపాన శ్రీరంగనాయకులు, ఎ.చినరంగ, బలగ శంకరభాస్కర్, బాడాన గిరి, చింతాడ వాసుదేవరావు, సర్పంచ్ ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే రవికుమార్ ప్రారంభించారు. ఈ శిక్షణను మహిళలు వినియోగించుకోవాలన్నారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్‌రెడ్డి


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ

శ్రీకాకుళం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెన్నుపోటు అనే పదానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నిలుస్తారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ అన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌రెడ్డి వేసే ప్రతి అడుగూ వెన్నుపోటు ఎలా ఉంటుందో చూపిస్తుంటుందని విమర్శించారు. సొంత తల్లికీ, చెల్లికీ వెన్నుపోటు పొడిచారని వాఖ్యానించారు. గత ఐదేళ్లలో జగన్ చేయలేని పనులు కూటమి ప్రభుత్వం ఏడాదిలో పూర్తి చేసిందని వివరించారు. గత ఐదేళ్ల పాలనలో ఏమీ చేయక రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచాడని, అందుకే 11 సీట్లకే జగన్‌ను ప్రజలు పరిమితం చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు.. గొడ్డలివేటుకు పేటెంట్

శ్రీకాకుళం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ధర్నాల డ్రామాను జగన్ ఆడుతూ వెన్నుపోటుకు.. గొడ్డలి వేటుకు జగన్మోహనరెడ్డి పేటెంట్ పొందారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలి ఏడాదిలో పది శాతం హామీలను కూడా అమలు చేయని జగన్ ప్రభుత్వం అని.. కానీ కూటమి ప్రభుత్వం ఏడాదిలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని వివరించారు. 70శాతం హామీలను మొదటి ఏడాదిలోనే అమలుచేశామని చెప్పారు.

ప్రజల దృష్టి మరల్చడానికే డ్రామాలు

కవిటి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ గత ఐదేళ్ల పాలనలో కుంభకోణాలు చేసి ఒక్కొక్కరు కటకటాలు పాలవుతున్న తరుణంలో ప్రజల దృష్టిని మరల్చడానికే జగన్‌రెడ్డి డ్రామాలకు తెరతీశాడని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ విమర్శించారు. రామయ్యపుట్టుగలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో బాబాయ్‌ని చంపిన వారిని కాపాడుతూ రక్తసంబధీకులను వెన్నుపోటు పొడిచారన్నారు. ఆస్తికోసం కుటుంబ సభ్యులనే రోడ్డుకీడ్చిన ఘనుడు జగన్‌రెడ్డి అని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో 70శాతం హామీలను అమలు చేసిందన్నారు. జగన్ రెడ్డి పాలనలో 85శాతం హామీలను ఎగనామంపెట్టారన్నారు. మద్యపాన నిషేధం అని చెప్పి విషపూరిత మద్యాన్ని అమ్మకాలు చేసి వేలకోట్లు దోచుకుని, పేదల ఆరోగ్యానికి వెన్నుపోటు పొడిచారన్నారు. కూటమి పాలన వచ్చిన వెంటనే రహదారులు మెరుగుపర్చి, ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశామన్నారు. అన్ని వర్గాలను న్యాయం చేస్తూ ముందుకు సాగుతున్న ప్రభుత్వంపై విమర్శలు చేసి లబ్ధిపొందాలనుకుంటే ప్రజలు తగిన శాస్తి చేస్తారన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


కవిటి: కొత్తపాలెం సముద్ర తీరంలో యోగాసనాల్లో పాల్గొన్న విప్ అశోక్

కవిటి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నిరంతర యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కొత్తపాలెం సముద్రతీరంలో మండల అధికారులు, సిబ్బంది, స్థానికులు దాదాపు 500మందితో మంగళవారం యోగాంధ్ర నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ ప్రతీరోజూ కొంత సమయాన్ని కేటాయించి యోగాను నిత్య ప్రక్రియగా చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఈగల్ టీం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మత్తుపదార్థాల నివారణకు ప్రభుత్వం ఈగల్‌టీంను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.మురళీమోహన్, ఎస్ఐ వి.రవివర్మ, మండల పరిషత్, వ్యవసాయ, ఉపాధిహామీ, వెలుగు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

- ఇచ్ఛాపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తహసీల్దార్ ఎన్.వెంకటరావు అన్నారు. డొంకూరు సముద్రం ఒడ్డున రెండు గంటల సేపు యోగాసనాలు వేశారు. మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి రెండు గంటల పాటు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు కలిసి యోగా విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు, ఐసీడీఎస్ పీవో నాగరాణి, ఏపీఎం ఎస్.ప్రసాద్, యోగా టీచర్స్, నాయకులు సాడి సహదేవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనమే లక్ష్యం కావాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాను పచ్చదనంతో నింపడమే లక్ష్యంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లా, మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. మొక్కల సంఖ్య, వాటి లభ్యతను ఖచ్చితంగా అంచనా వేయాలని, ట్రీ గార్డులు సిద్ధం చేయాలని, సోక్ పిట్స్, కంపోస్టు పిట్స్ పూర్తి చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, జూనియర్ రెడ్‌క్రాస్, వెల్ఫేర్ అసోసియేషన్లను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి యోగాంధ్ర ప్రచారం కోసం ముందస్తు సన్నాహాలను వేగవంతం చేయాలన్నారు. అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమీక్షలో జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, వ్యవసాయాధికారి త్రినాథస్వామి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, హౌసింగ్ పీడీ నగేష్, ఏపీఈపీ డీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చింతామణి అమ్మవారి ఉత్సవం


అమ్మవారి గజముద్దలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కవిటి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కవిటి చింతామణి అమ్మవారి సంబర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగిం ది. ఉషోదయ యువజన సంఘం, గ్రామస్థుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో గజముద్దలు, కాళిక నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాముగరిడీ, కోయడ్యాన్స్, మహిళల కోలాటంతో సందడి చేశారు. గ్రామపురవీధుల్లో ఊరేగింపు చేపట్టి అనంతరం ఆలయానికి చేరుకొని మెక్కులు తీర్చుకున్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

కంచిలి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యా ర్థులకు నాణ్యమైన భోజనం అందివ్వాలని ఎంఈవోలు చిట్టిబాబు, శివరాం తెలిపారు. మంగళవారం కంచిలి జడ్పీ హైస్కూల్ మధ్యాహ్న భోజన వంట నిర్వాహ కులతో మాట్లాడారు. మెనూ తప్పకుండా పాటించాలని సూచించారు.

రేపు జిల్లా కోర్టు ప్రాంగణంలో పర్యావరణ దినోత్సవం

శ్రీకాకుళం లీగల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5న జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉదయం 9.30 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇతర న్యాయాధికారులు, న్యాయవాదులు, ప్రభుత్వ అధికారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం ఇచ్ఛాపురం మున్సిపాల్టీలో బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినంను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ పరిధిలో ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా పార్లమెంటరీ పరిశీలకులు కుంభ రవిబాబు, ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొంటారని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

ఎరువుల వినియోగం తగ్గించాలి

ఎచ్చెర్ల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల (ఎస్ఎస్ఆర్ పురం) అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోష్ అన్నారు. ధర్మవరం గ్రామంలో మంగళవారం అధిక దిగుబడులు-భూసార పరీక్షలపై తీసుకోవల్సిన మెలకువలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో మట్టి శాస్త్ర విభాగం అసోసియేట్ కేవీఎస్ఎల్ రాజ్‌రుషి, విస్తరణా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.యామినిలీల, అగ్రికల్చర్ అసిస్టెంట్ వనిత, రైతులు పాల్గొన్నారు.

ఈగల్, సంకల్పం పోస్టర్ల ఆవిష్కరణ

శ్రీకాకుళం రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): పెద్ద గణగళ్లవానిపేట తీర ప్రాంతంలో మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ ఈగల్, సంకల్పం పోస్టర్లు ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాల రవాణాను అడ్డుకునేందుకు అవగాహన కల్పించేందుకు ఈగల్ టాస్క్‌ఫోర్స్, సంకల్పం పేరిట జిల్లా పోలీసు యంత్రాంగం వీటి రూపొందించింది. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేష్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, డ్వామా పీడీ సుధాకర్, డీఎంహెచ్‌వో కె.అనిత, స్త్రీ, మహిళ శిశు సంక్షేమశాఖ పీడీ బి.శాంతి, సీఐలు పైడిపునాయుడు, శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ కె.రాము తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి అచ్చెన్న


మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందించిన దివ్యాంగుడు

టెక్కలి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. నందిగాం మండలం శివరాంపురం పంచాయతీ భరణిగాం గ్రామానికి చెందిన దివ్యాంగుడు మళ్ల గిరిబాబు తనకు శతశాతం దివ్యాంగత్వం ఉంటే నెలవారీ ఇచ్చే పింఛన్ ఆ స్థాయిలో అందడం లేదని వాపోయాడు. తనకు పూర్తి స్థాయి పింఛను అందేలా చూడాలని కోరాడు. టెక్కలి మండలం చిన్నకేదారి వరకు బీటీ రోడ్డును అసంపూర్తిగా వదిలేశారని, దీంతో రాకపోకలకు గిరిజన గ్రామాల ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. పూర్తిస్థాయి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. కోటబొమ్మాళి మండలం తర్లిపేటకు సీసీ రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు అర్జీ అందించారు. భూ సమస్యలు, సీసీ రోడ్లు, డ్రైన్లు, కళాశాలలు, ఐటీఐ, ఇతర విద్యా సంస్థల్లో తమకు సీట్లు కావాలని..ఇలా వివిధ వర్గాల వారు వినతులు అందించారు. అంతకుముందు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు సుధాకర్, రామకృష్ణ తదితరులతో వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. మంత్రిని కలిసిన వారిలో మెండ దాసునాయుడు, బోయిన రమేష్, పినకాన అజయ్‌కుమార్, జీరు భీమారావు, బోయిన గోవిందరాజులు, రెడ్డి అప్పన్న, కింగ్, మదన్‌గౌడ్, మల్లిపెద్ది మధు తదితరులు ఉన్నారు.

నాణ్యమైన సేవలే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నంలో జీసీసీ రేషన్ డిపోలో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సౌలభ్యమే ప్రాతిపదికగా నిత్యావసర సరుకుల పంపిణీలో ప్రభుత్వం మార్పులు తీసుకువచ్చిందన్నారు. దివ్యాంగులకు, వృద్ధులకు నేరుగా ఇంటి వద్దకే పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు తమ వీలునిబట్టి సరుకులు తీసుకునే వెసులుబాటు కలిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.చంద్రకుమారి, డీటీలు ప్రసాద్, రమణ పాల్గొన్నారు.

ప్రజాదరణను చూసి తట్టుకోలేకనే...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే వస్తున్న ప్రజాదరణను చూసి సహించలేక మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుపోటు పేరుతో రంకెలు వేస్తున్నారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 70శాతం ఎన్నికల హామీలను అమలు చేసిందని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పైల బాబ్జి, మడ్డు రామారావు, నేతలు కలమట భుజంగరావు, పెద్దింటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లకు అనుమతులు రద్దు


స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు రామారావు, మైనింగ్ అధికారులు

జలుమూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వంశధార నదిలో ఉన్న పర్లాం, అంధవరం, దొంపాక ఇసుక రీచ్‌ల అనుమతులు రద్దయ్యాయని... మళ్లీ అనుమతులు ఇచ్చే వరకు ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు జన్ని రామారావు హెచ్చరించారు. పర్లాం, అంధవరం, దొంపాక ఇసుక రీచ్‌లను మంగళవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక రీచ్‌లకు ఇదివరలో ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు గతనెల 31తో రద్దు చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. అనుమతులు లేకుండా వంశధార నుంచి ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక అక్రమ తరలింపుపై పోలీసులు, రెవెన్యూ అధికారుల నిఘా ఉందన్నారు. వీఆర్వోలతో గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తహసీల్దారు వెంట ఎస్.ఐ. అశోక్‌బాబు, సర్వేయర్ తర్ర నాగేశ్వరరావు, మైనింగ్ ఇన్‌స్పెక్టర్ గణేష్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు విలువ ఇవ్వరా?


ఏవోను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

పలాస రూరల్, జూన్3 (ఆంధ్రజ్యోతి): 'మమ్మల్ని ప్రజలు ఎన్నుకున్నారు. మాకు తెలియకుండా... విలువ ఇవ్వకుండా పనులు చేసుకుంటుంటే మేమంతా ఎందుకు? కనీస మర్యాదలు పాటించరా?' అని ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు సాధించిన ప్రగతిపై సమావేశంలో వివరించారు. హౌసింగ్, వ్యవసాయ, విద్యుత్ అంశాలపై చర్చించినప్పుడు మండల ప్రత్యేకాహ్వానితుడు సాయికృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు దుర్యోధనలు అధికారులను ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులకు విలువ ఇవ్వకుండా గ్రామాలలో వారికి నచ్చిన వారికి తెలపడం ఏమిటని? కచ్చితమైన సమాచారం ప్రజాప్రతినిధులకు ఇవ్వాలని కోరారు. తమకు తెలియకుండా పనులు జరుగుతుంటే తమ ఉనికి ప్రశ్నార్థకమవుతుందని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అన్నదాతా సుఖీభవ, రేషన్ సమస్యలపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో ఎన్.వసంత్‌కుమార్, ఈవోపీఆర్‌డీ మెట్ట వైకుంఠరావు, ప్రత్యేకాధికారి పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఐక్యతను చూసి ముగ్ధుడినయ్యా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవేంద్రయాదవ్

వజ్రపుకొత్తూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతంలో ప్రజల ఐక్యత, సోదర భావాన్ని చూసి ముగ్ధుడినయ్యానని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయ్ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి దేవేంద్ర యాదవ్ అన్నారు. మెట్టూరులో జరుగుతున్న కొండ మహంకాళి గ్రామదేవత ఉత్సవాల్లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి.. అమ్మవారికి పూజలు చేశారు. గతంలో అక్కుపల్లిలో జరిగిన గ్రామదేవత ఉత్సవాల్లో పాల్గొన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతం ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. రాజకీయాలు మాట్లాడానికి తాను రాలేదన్నారు. ప్రజలతో ఉన్న భక్తిభావం, అందరినీ గౌరవించే విశాల దృక్పథం, స్నేహభావం తనకు ఎంతో ఇష్టమన్నారు. రెండు రోజులుగా స్థానికులు చూసిన ప్రేమాభిమానాలను మరచిపోలేనని చెప్పారు. తెలుగు ప్రజలంటే ఎంతో అభిమానమని...అందువల్లనే ఆహ్వానించిన వెంటనే మెట్టూరు సంబరాలకు వచ్చినట్లు చెప్పారు. సముద్రతీరంలో వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మెట్టూరు గ్రామస్తులు ఎమ్మెల్యే దేవేంద్ర యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. ఆయనతో దువ్వాడ హేమబాబు చౌదరి, దాసరి జేజేరావు, లక్ష్మీపతి, మల్లా రవికుమార్, జి.రాజు. నాగమణి, కామరాజు, చిరంజీవి ఉన్నారు.

పశువైద్య కేంద్రం ఏర్పాటు చేయాలి

పోలాకి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కుసుమపోలవలస సచివాలయ ప్రాంగణంలో పశువైద్యకేంద్రం ఏర్పాటు చేయాలని సర్పంచ్ తర్ర లక్ష్మీనారాయణ... ఎమ్మెల్యే బగ్గురమణమూర్తిని కోరారు. కుసుమపోలవలసలో పాడి రైతులు అధిక సంఖ్యలో ఉన్నారని, రోజుకి 1500లీటర్ల పాలను డెయిరీల ద్వారా అందజేస్తున్నారని తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కోసం సచివాలయ లైన్‌మెన్‌ను నియమించాలని కోరారు. అప్పటి ఎమ్మెల్యే కృష్ణదాస్ ఒత్తిడితో లైన్‌మెన్‌ను దేశవానిపేటకు పంపించారని తెలిపారు. కేపీవలసకు విద్యుత్ మరమ్మతులు చేయడం కష్టంగా ఉందని, వెంటనే లైన్‌మేన్‌ను నియమించాలని కూన రాంబాబు కోరారు.

రైతులకు రాయితీపై వరి విత్తనాలు: ఎమ్మెల్యే

పోలాకి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఖరీఫ్ రైతులకు రాయితీ ధరలపై విత్తనాలను సరఫరా చేస్తోందని, వాటిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రానున్న ఖరీఫ్ కాలంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ ఇన్‌చార్జి బగ్గు అర్చన, బైరి భాస్కరరావు, సూరపు నారాయణదాస్, సర్పంచ్ మజ్జిలక్ష్మీరమణమ్మ, వ్యవసాయశాఖ ఏడీ రవీంద్రభారతి, ఎంపీడీఓ రవికుమార్, వ్యవసాయాధికారి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

హాలాహాలేశ్వర స్వామికి పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

నరసన్నపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపాడు వద్ద గత రెండు రోజులుగా హాలాహాలేశ్వర స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ప్రతిష్ఠా సంకల్పం తదితర పూజలను సత్యవరాగ్రహార రుత్వికులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా జడ్డమ్మతల్లి పండుగ


ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

పాతపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బూరగాం, చిన్నలోగిడి గ్రామాల్లో శ్రీ జడ్డమ్మతల్లి పండుగలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బూరగాంలో భారీ స్థాయిలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే చిన్నలోగిడి గ్రామంలో జడ్డమ్మతల్లి ఘటాల ఊరేగింపు, అనుపోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిన్నలోగిడిలో జరిగిన ముగింపు ఉత్సవంలో ఎమ్మెల్యే గోవిందరావుతో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రారంభోత్సవాలు

నందిగాం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాంపురం పంచాయతీ చిన్నలక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన జడ్డమ్మతల్లి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవాలు బుధవారం నుంచి జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మూడురోజుల పాటు సాగే ఉత్సవాలలో భాగంగా అమ్మవారి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠతో పాటు పోతురాజు పాదాలు, శిఖర, యంత్ర ప్రతిష్ఠ ఉంటాయన్నారు.

అక్రమంగా కేసుల నమోదు తగదు


ఆందోళన చేస్తున్న గిరిజనులు

మెళియాపుట్టి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గిరిజనులపై అక్రమంగా సాటుసారా కేసులు నమోదు చేస్తున్నారని.. వీటిని నిలుపుదల చేయాలని గిరిజన సంఘ నాయకులు సవర కుమార్ ఆధ్వర్యంలో గిరిజనులు మంగళవారం ఆందోళన చేపట్టారు. కేరాశింగి, భరణికోట, మారడికోట, వెంకటాపురం, దీనబంధుపురం, ఇలాయిపురం, అంపురం పంచాయతీల్లో అధికంగా గిరిజనులపై అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. దీనిపై ఆందోళనను ఉధృతం చేసేందుకు సిద్ధమవుతున్నామని వివరించారు. ఆయనతో పాటు సరవ శ్రీరాములు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణాన్ని కాపాడాలి


మొక్కలు నాటే ప్రాంతాలను పరిశీలిస్తున్న ఆర్డీవో, జిల్లా అటవీశాఖ అధికారి తదితరులు

టెక్కలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.వెంకటేష్‌తో కలిసి పరిశీలించారు. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాదం, కాగు, నేరడు, వేప తదితర రకాల మొక్కలు నాటాలని నిర్ణయించారు. మొక్కల పెంపకంపై న కూడా శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి వై.జగదీష్, సెక్షన్ ఆఫీసర్ కృష్ణారావు, సిబ్బంది ఝాన్సీ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లు కట్టి తిరిగి వెళుతూ..


ఉపేంద్ర (ఫైల్)

పలాస, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఇంటి విద్యుత్ బిల్లు కట్టి తిరిగి వెళుతూ.. మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో సున్నాడ గ్రామానికి చెందిన కుమ్మరి ఉపేంద్ర(63) అనే వృద్ధుడు మృతి చెందాడు. కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ కథనం మేరకు...ఉపేంద్ర తన ఇంటి బిల్లు కట్టేందుకు విద్యుత్ కార్యాలయానికి వెళ్లి...అక్కడి నుంచి బయలుదేరాడు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. నడుం భాగంపై నుంచి బస్సు చక్రాలు వెళ్లిపోవడంతో వెన్నుపూస విరిగిపోయింది. చికిత్స పొందుతూ ఆసుపత్రిలోనే ఉపేంద్ర మృతి చెందాడు. ఆయన కుమ్మరి పనిచేసుకొని జీవనోపాధి పొందుతున్నాడు. గత ఏడాది ఆయన భార్య మృతి చెందగా... కుమారుడు, కుమార్తె వేరే ప్రాంతంలో ఉంటున్నారు. ఈ మేరకు బాధితుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్యాన్సర్‌తో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి


బాలరాజు(ఫైల్)

సంతబొమ్మాళి, జూన్3 (ఆంధ్రజ్యోతి): రుంకు హనుమంతుపురానికి చెందిన సైలాడ బాలరాజు(37) అనే ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ క్యాన్సర్‌తో మృతి చెందారు. హైదరాబాద్‌లో ఆర్ఎం రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బాలరాజు మూడేళ్లుగా క్యాన్సర్‌తో బాధ పడుతున్నారు. మంగళవారం స్వగ్రామమైన రుంకుహనుమంతుపురంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

సిమెంట్ లారీ దగ్ధం


కాలిపోతున్న సిమెంట్ లారీ

నరసన్నపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నుంచి ఒడిశా వైపు వెళుతున్న సిమెంట్ లారీ విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో దగ్ధమైన సంఘటన నరసన్నపేట మండలం తామరాపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. ఇంజన్ భాగంలో వైర్లు షార్టు సర్క్యూట్ కావడంతో పొగలు వచ్చాయి. ఇది గమనించిన లారీ డ్రైవర్ వాహనాన్ని జాతీయ రహదారికి పక్కనే నిలిపివేశారు. అప్పటికే మంటలు వ్యాపించి.. లారీ మొత్తం దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన ప్రాంతానికి చేరు కొని మంటలను అదుపులోకి తెచ్చారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డారు.

బలదలో రేషన్ బియ్యం స్వాధీనం


బియ్యం నిల్వలతో అధికారులు, స్థానికులు

కొత్తూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బలదలోని మాదవ హరి ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా మంగళవారం దాడులు చేసి పట్టుకున్నట్టు తహసీల్దారు కె.బాలకృష్ణ తెలిపారు. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు చేసిన దాడుల్లో సుమారు 24 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని.. సరుబుజ్జిలి ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించామన్నారు. మాదవ హరిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో రెవెన్యూ విజిలెన్స్ ఎస్ఐ బి.రామారావు, ఆర్ఐ లక్ష్మణరావు, వీఆర్వో రాజగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాం టు గుజరాత్

● నాలుగు కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నమనాయుడు

ఇచ్ఛాపురం, జూన్ 3(ఆంధ్ర జ్యోతి): ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా నుంచి గుజ రాత్‌కు తర లిస్తున్న నాలుగు కిలోల గం జాయితో ఇద్దరు వ్యక్తులను పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సీఐ మీసాల చిన్నమనాయుడు వివరాలు వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ షెకావత్ తన కుటుంబంతో గుజరాత్ రాష్ట్రం వాసి పట్టణంలో నివసిస్తున్నాడు. తన బావమరిది అర్షద్ ఒడిశాకు చెందిన దలబెహరా చిత్రసేన అతడితో మాట్లాడే సమయంలో గంజాయి కొనడం, అమ్మడంపై విన్నాడు. తను కూడా గంజాయి వ్యాపారం చేస్తామని నిర్ణయించుకొని ఒడిశాలో ఉన్న చిత్రసేన్‌తో ఫోన్‌లో మాట్లాడి గంజాయి కావాలనడంతో బరంపురం రమ్మన్నాడు. దీంతో మంగళవారం ఒడిశా వెళ్లి నాలుగు కిలోల గంజాయిని కొనుగోలు చేసి ఇద్దరూ కలిసి బస్సు వచ్చి ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. గంజాయి తరలిస్తున్నట్లు పట్టణ ఎస్ఐ ముకుందరావుకు సమాచారం రావడంతో వెంటనే వెళ్లి తనిఖీలు వారి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని, రెండు సెల్ ఫోన్లు సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

సరుబుజ్జిలి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం గ్రామ సమీపంలో ఉన్న వంశధార నది నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను తహసీల్దారు ఎల్.మధుసూదన్, ఎస్ఐ బి.హైమావతి పట్టుకున్నట్టు తెలిపారు. మంగళవారం పురుషోత్తపురం ఇసుక ర్యాంపులో ఉన్న నిల్వలను పరిశీలించేందుకు వీరు వెళ్లారు. గత నెల మే 31తో ఉచిత ఇసుక గడువు పూర్తయిందని, అయినా ఉచిత ఇసుక పేరుతో తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

ఎచ్చెర్ల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అరిణాం అక్కివలస గ్రామానికి సమీపంలో లావేరు మండలం బుడుమూరు గ్రామానికి చెందిన కొలుసు గోపి (39) మంగళవారం సాయంత్రం పాముకాటుకు గురై మృతిచెందాడు. గోపి తాటి కళ్లు తీసేందుకు చెట్టు ఎక్కి దిగుతుండగా పాముకాటు వేసింది. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గోపి మృతిచెందాడు. గోపికి భార్య దేవి, ఒక కుమారుడు ఉన్నారు. దేవి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

ఎంపీడీవోగా ఫణికుమార్

టెక్కలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): టెక్కలి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.ఫణికుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కోటబొమ్మాళితో పాటు టెక్కలి మండలానికి ఎఫ్ఏసీ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మండల పరిషత్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి..స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో లక్ష్మీబాయి పదవీ విరమణ చేశారు.

ఇన్‌చార్జి ఎమ్పీడీవోగా రేణుక

నరసన్నపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ఇన్‌చార్జి ఎమ్పీడీవోగా రేణుకాదేవిని నియమిస్తూ జెడ్పీ సీఈవో మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఎమ్పీడీవోగా పనిచేసిన మధుసూధనరావు పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో పూర్తి అదనపు బాధ్యతలను ఈవోఆర్డీవోగా పనిచేస్తున్న రేణుకాదేవికి అప్పగించారు.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ

మందస, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో చదువుతున్న 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు 3 జతల యూనిఫారాలు, 2 జతల బూట్లను పంపిణీ చేశామని ఎంఈవో లక్ష్మణరావు తెలిపారు. పాఠశాలలు తెరిచే సమయానికి వీటిని అందజేస్తామని తెలిపారు.

పోలాకిలో...

పోలాకి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను సంబంధిత పాఠశాలలకు తరలిస్తున్నామని ఎంఈఓలు శ్రీనివాసనాయక్, లింగరాజు, ఎంఆర్‌సీ నాయుడు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 17వేల పాఠ్యపుస్తకాలు సరఫరా అయ్యాయన్నారు. జూన్ 12న పాఠశాలలు తెరిచే రోజున గ్రామపెద్దల సమక్షంలో పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయాలని వారు ఉపాధ్యాయులను ఆదేశించారు.

విమర్శలు తగవు

నరసన్నపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పాలకవర్గ సభ్యులపై మాజీ ఎమ్పీటీసీ సభ్యుడు జామి వెంకట్రావు లేనిపోని విమర్శలు చేయడం తగదని సభ్యులు అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సాంకేతిక సమస్య తో మూడు రోజుల పాటు కుళాయిలు పనిచేయకపోతే వ్యవస్థ మొత్తాన్ని హేళన చేసి మాట్లాడటం సరైన విధానం కాదన్నారు. పంచాయతీ అభివృద్ధికి సూచనలు ఇస్తే పాటిస్తామని సర్పంచ్ శంకరరావు, ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు బోయిన సతీష్, లోకనాథశర్మ, రఘుపాత్రుని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు శివాలయం ప్రారంభోత్సవం

కొత్తూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మెట్టూరు బిట్-2 పాడలి నిర్వాసిత గ్రామంలో శ్రీ ఉమా కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవాలు ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు సర్పంచ్ యర్లంకి ధర్మారావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఉద్యానవన పంటలే మేలు

నరసన్నపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటలను సాగు చేయాలని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త హరికుమార్ సూచించారు. మంగళవారం గోపాలపెంట గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉద్యానవన పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. జీడిమామిడి, కొబ్బరి పంటలను సాగు చేయడం ద్వారా వచ్చే ఆదాయ మార్గాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి అమల, రాంబాబు పాల్గొన్నారు.

కాళీమాత ఉత్సవాలు ప్రారంభం

వజ్రపుకొత్తూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సీతాపురం గ్రామంలో కాళీమాత ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు ముర్రాటలు తీసుకువెళ్లి అమ్మవారికి అభిషేకాలు చేశారు. మూడురోజులు పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు పూజా కమిటీ తెలిపింది.

మలేరియాపై అవగాహన ర్యాలీ

సంతబొమ్మాళి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం గ్రామంలో మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో దోమలు గుడ్లు పెట్టే ప్రాంతాలను గుర్తించి... వాటిని ధ్వంసం చేయాలని వైద్యాధికారి డా.పరిమళ అన్నారు. గ్రామాల్లో దోమల నివారణపై ప్రజలకు ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. ఈ ర్యాలీలో సూపర్‌వైజర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎండీఎం నిర్వాహకులకు శిక్షణ

నరసన్నపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక్క రోజు శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. శుచిగా, పోషకాలతో కూడిన ఆహారం తయారు చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు, ఎండీఎం నిర్వాహకులు పాల్గొన్నారు.